
కథ



# అజ్ఞానశంకరం

డా॥ మంతెన సూర్యనారాయణరాజు

"ఏవండోయ్ శ్రీవారూ! మీరు లక్ష చెప్పండి. నన్ను తిట్టండి, కొట్టండి నేను మీరు చెప్పిన పని మాత్రం చెయ్యనుగాక చెయ్యను. ఎందుకంటారేమో! మన పెళ్లినాడే మీకివ్వాల్సిన కట్నం అణాపైసలతో మానాన్న ముదుపుకట్టి మరీ యిచ్చాడు. అందుచేత.." అంటూ యింకా ఏదో చెప్పబోయింది.

శంకర్రావు భార్య మాటకు అడ్డొస్తూ "అది కాదే! వెర్రిపీనుగా!"

"అబ్బబ్బా! నే చెప్పదలచుకున్న మాట చెబుతూంటే సొంతం వినరే! మీ గోల మీదేనన్నమాట!" అంటూ విసుక్కుంది సుభాషిణి.

అసలే తలతిక్కమనిషేమో, ఆమె అన్న మాటకు తోక తొక్కిన తాచులా మండిపడ్డాడు. అంతే కాదు. మహామంచి శంకర్రావల్లా మూర్ఖశంకర్రావులా మారిపోయి భార్య మీదికి ఒక్క ఉదుటున వెళ్లాడు.

ఆమె భర్త వాలకం చూసి ఆశ్చర్యపోయింది. ఏ నాడూ లేనిది మీది కొస్తూంటే కొడతాడేమో భర్త అనుకుని, ఎందుకైనా మంచిదని, ముందు జాగ్రత్త కోసం పిల్లలెక్కడున్నారోనని చూస్తూ చీరకొంగు బొడ్డులో కుక్కుకుంది.

భార్య కొంపదీసి తనను ప్రతిఘటిస్తుందేమోననుకుని శంకరరావు మండిపడుతూ, "నీకిదే చెబుతున్నాను. మీ నాన్నెలాగూ కొడుకులిద్దరికీ పొలం వ్రాయలేదు సరిగదా!..."

అతని మాట పూర్తికాలేదు. సుభాషిణి, భర్తతో, "ఆ మాటలేవీ నా చెవికెక్కవు. ఆ విషయం తప్ప మరోటి చెప్పండి" అంది.

"మరో విషయం చెప్పేపాళమైతే నీతో యిప్పుడీ కంఠశోష ఎందుకు? మన పెళ్లినాటికి మీ నాన్న ఆస్తి పదిలక్షల విలువ చేస్తుంది. ఇప్పుడు 54 లక్షలకు పెరిగింది. నేను చెప్పేది పొలం కాకుండా సుమా! బ్రహ్మాండమైన బంగ్లా కట్టాడు. మారుతీకారు కొన్నాడు. పొలం కాకుండా చెరో పాతి లక్షలూ ముడుతుంది. ఎలాగూ ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు అంటూ ప్రభుత్వం ఆర్డినెన్సు పాస్ చేసింది కదా! కాబట్టి నా మాట విని వెంటనే నువ్వు దీని మీద సంతకం చేస్తే, చిన్న దావా కోర్టులో పడేస్తా! డబ్బు మాటెలావున్నా, పొలంలో మూడో వాటా చచ్చినట్టు మనకు వస్తుంది" అన్నాడు.

"రామ రామ! ఇదెక్కడి అన్యాయమండీ! పెళ్లినాడు పీటల మీదే రెండు లక్షల కరుకులు ఇచ్చారు గదండీ! మళ్లీ మీకిదేం పాడుబుద్ధీ! నేనొప్పుకోను. హవ్వ! హవ్వ! ఎవరన్నా వింటే నవ్విపోతారు. ఇటువంటి తప్పుడు పని మీరు చేస్తున్నారంటే!" అంటూ విసుక్కుంది.

'ఒసేయ్ పిచ్చిదానా! మీ చిన్నన్నయ్య ఆస్తిపంపకాలు పెట్టమని రోజూ మీ నాన్నతో పేచీ పడుతున్నాడు. మీ నాన్న, వాడు తగలేస్తాడేమోనని రేపుమాపంటూ జరుపుకొస్తున్నాడు. కాబట్టి యిప్పుడే మనం మేలుకుంటే ఎంచక్కా మూడో వాటా వస్తుంది. ఏమంటావే!" లాలనగా అన్నాడు.

"మీ తెలివి తెల్లవారినట్లుంది. ఆ తండ్రీకొడుకులు తన్నుకుంటారు. కొట్టుకుంటారు, మధ్య మీకెందుకు? ఇన్నేళ్లొచ్చాయి. పిల్ల పెళ్లీడు కొచ్చింది. మగపిల్లలు కాలేజీలో చదువుతున్నారు. ఈ పరువు తక్కువ పని మీరు చేస్తున్నట్టు తెలిస్తే ఎంత సిగ్గుచేటు?" అంటూ తలపట్టుకుంది.

మదమంచి శంకర్రావుకు మరింత తిక్క రేగింది. "ఇదుగో, మర్యాదగా మరోసారి చెబుతున్నాను. ఈ కాగితం మీద సంతకం పెట్టు. వెంటనే లాయర్ చేత మీ నాన్నకు నోటీసు యిప్పిస్తాను" అంటూ గుడ్లెర్రజేశాడు.

"మీరెన్నిసార్లు చెప్పండి. నేను పెట్టనంటే పెట్టను!" అంటూ పోబోయింది.

"ఆగు! అలా ఎక్కడికెళ్తున్నావు? నదు పుట్టింటికి!" అంటూ జబ్బ పట్టుకుని వీథి గుమ్మం వైపు గెంటాడు.

ఆమె తూలిపడబోయి నిబ్బరించుకుంటూ, "బాబూ రఘూ! అమ్మాయ్ నిర్మలా! చంటీ వొరేయ్! మీ నాన్న నన్ను..." అంటూ వెక్కివెక్కి ఏడవసాగింది.

తారస్థాయి కెళ్ళిన శంకర్రావు కోపం, పిల్లలొస్తే కొంప మునుగుతుందని, కాస్త తగ్గుముఖం పట్టసాగింది. వాళ్లందరికీ తల్లి అంటే ఎంతో గౌరవం.

పెద్దబ్బాయి రఘు అక్కడికొస్తూ, యిద్దర్నీ మార్చి మార్చి మరీ చూశాడు. చేతిలో పుస్తకం వుంది. ఏదో సీరియస్‌గా చదువుకుంటు న్నట్టున్నాడు. ముఖంలో చిరాకు దోబూచులాడుతోంది. తల్లికి దగ్గరగా వెళ్లాడు.

శంకర్రావు తన్నిగానట్టు పైకి చూస్తూ వుండి పోయాడు.

సుభాషిణి కొడుకు రఘు గుండెల్లో తలదాచుకుంటూ, "చూడరా నాన్నా! మీ నాన్నకు నీవైనా కాస్త బుద్ధి చెప్పు. తాతయ్య ఆస్తిలో నాకు మూడవ వాటా కావాలని సంతకం చేయమని నిర్బంధిస్తున్నారు! సంతకం పెడితే ఆస్తి కోసం కోర్టు కెక్కుతారట. ఆ నాడు కట్నం పేరుతో రెండు లక్షలు పుచ్చుకున్నది కాక, మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఆ పత్రం మీద సంతకం చెయ్యమంటావురా?" అంటూ పైట కొంగుతో కన్నీరు తుడుచుకుంది.

రఘు, తల్లిని గుండెలకేసి హత్తుకుంటూ, "అమ్మా! తప్పేముందమ్మా! నాన్న గారడిగిందాన్లో?" అన్నాడు. సుభాషిణి పెద్దకొడుకు వైపు అయోమయంగా చూసింది. శంకర్రావు మీసం మెలేస్తూ "విన్నావటే! వాడు నా కొడుకే! ఇప్పుడే మంటావు? అందుకే నేను చెప్పిన విధంగా సంతకం పెట్టేయ్, అరిచి గీపెట్టక! ఆ ఆస్తి నీ కిందే వుంచుకుని ఫలితం అనుభవిద్దువు గాని" అన్నాడు. "నాన్నా! మీరింత నరరూపరాక్షసులనుకోలేదు!" అంటూ అరిచాడు రఘు, తండ్రి మీద.

రఘు, తల్లిని గుండెలకేసి హత్తుకుంటూ, "అమ్మా! తప్పేముందమ్మా! నాన్న గారడిగిందాన్లో?" అన్నాడు.

సుభాషిణి పెద్దకొడుకు వైపు అయోమయంగా చూసింది.

శంకర్రావు మీసం మెలేస్తూ "విన్నావటే! వాడు నా కొడుకే! ఇప్పుడే మంటావు? అందుకే నేను చెప్పిన విధంగా సంతకం పెట్టేయ్, అరిచి గీపెట్టక! ఆ ఆస్తి నీ కిందే వుంచుకుని ఫలితం అనుభవిద్దువు గాని" అన్నాడు.

"నాన్నా! మీరింత నరరూపరాక్షసులనుకోలేదు!" అంటూ అరిచాడు రఘు, తండ్రి మీద.

అతనిలో సహనం చచ్చిపోయినట్టై "ఒరేయ్! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అన్నాడు.

"ఆ..! తెలుసు నాన్నా! బాగా తెలుసు. కన్నకొడుకే ఎదిరించి ఇలా మాట్లాడుతున్నాడని ఆశ్చర్యపడుతున్నారు కదూ! జాగ్రత్తగా వినండి. ఇంత వరకూ మీరేదో నిజాయితీ గల పోలీసాఫీసరని మురిసి పోయాను. అటువంటి తండ్రికి కొడుకుగా పుట్టానని నిన్నటి వరకూ గర్వపడ్డాను. ఇవ్వాళ మీ నిజస్వరూపం బైటపడి నీరుగారి పోయాను. చట్టపరంగా, న్యాయపరంగా మీ ఔన్నత్యాన్ని నేను ఎప్పుడూ కీర్తిస్తాను. కానీ ఆడదాని ఆస్తి కోసం ఇటువంటి నీచానికి దిగితే, అందులోనూ మనకు ముట్టాల్సింది ముట్టాక, యింకా తాతయ్యను, అమ్మకు మూడవ వాటా యిమ్మని ఒత్తిడి చెయ్యటం మన ప్రిస్టేజ్‌కే భంగం!" అంటూ వాదించాడు.

"ఒరేయ్ కుర్రకుంకా! నాకే నీతులు చెప్పేటంత పెద్దవాడి వయ్యావురా?" అంటూ చెయ్యెత్తి మీదిమీదికెళ్లాడు శంకర్రావు.

"ఆగిపోయారేం నాన్నా! కొట్టండి. చంపండి. రోజూ స్టేషన్లో లాఠీలతో అపరాధుల్ని, నిరపరాధుల్నీ కొట్టడం అలవాటే కదా! కానివ్వండి. ఇది మన యిల్లు, జైలు కాదు ఆ సంగతి గుర్తుంచుకోండి. మీ ఆదర్శాలు ఆ ఖాకీ బట్టల్లోనే వుంటాయి. మీ సంస్కారం మాటల్లోనే గానీ, ఆచరణలో శూన్యం. కొట్టండి. ఆగిపోయారే?" అంటూ మరింత ముందుకెళ్లాడు రఘు.

ఎత్తిన చెయ్యి దించాడు శంకరరావు.

ఈ లోగా కుమార్తె నిర్మల, చిన్నవాడు చంటిబాబూ అక్కడికి వచ్చి, పరిస్థితి అంచనా వేసి, కొయ్యబారిపోయి నిలుచున్నారు.

అక్కడ నిలబడ్డం యిష్టం లేక శంకర్రావు పెద్దగా అంగలేసుకుంటూ పోయి తన గది తలుపులు భడాల్న మూసుకున్నాడు. అందరూ ఒకళ్ల ముఖాలు మరొకరు వింతగా చూసుకున్నారు.

000


ఆ మరునాడు స్టేషన్‌లో తన రూమ్‌లో సీరియస్‌గా ఏదో కేసు తాలూకు దర్యాప్తు విషయంలో ఎస్.ఐ., తానూ, గుంపు తెంపులు పడుతున్నారు. కానిస్టేబుల్‌ని పిలిచి కూజాలో మంచి నీళ్లు తెప్పించుకుని తాగాడు శంకర్రావు. చెరో టీ తెమ్మని ఐదు నోటిచ్చి మళ్లీ కేసు విషయంలో చర్చల్లో పడ్డాడు. కాస్సేపట్లో ఇరానీ టీ తెచ్చాడు. చెరో టీ తాగాక, శంకర్రావు సిగరెట్ వెలిగించి రెండు దమ్ములు లాగాడు.

ఈ లోగా శంకర్రావు కొడుకు వచ్చి తల వంచుకు నిలబడ్డాడు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్రావుకి ముచ్చెమటలు పోశాయి. కొంపదీసి వీడు గాని యింటి గొడవ రచ్చకీడ్వటం లేదు గదా-అనుకుంటూ, కర్చీఫ్‌తో చెమట తుడుచుకుంటూ, పుత్రరత్నంతో, "ఏరా! రఘూ, ఎందుకొచ్చావు?" అంటూ ప్రశ్నించాడు.

రఘు తల ఎత్తకుండా "చిన్న మావయ్య మీతో పనుండి వచ్చాడు. వీలు చూసుకుని ఒకసారి యింట కొస్తే విషయం మాట్లాడి వెళ్తాడట" అన్నాడు.

"ఏదన్నా క్రైం కేసా?"

"కాదు. కుటుంబ వ్యవహారమట. నేవెళ్తున్నా!" నా పని యిక అయ్యిపో యిందన్నట్టు డోర్ తీసుకుని రఘు వెళ్లిపోయాడు.



హమ్మయ్య అని లోలోపల

తన మనస్సును పదిల పరచుకుని మిగిలిన సిగరెట్ తగలేసి, కేసు విషయం చర్చలోకి దిగాడు.

నాలుగున్నర గంటల వేళ ఇంటికెళ్లాడు. అప్పటికే శంకర్రావు రెండో బావమరిది రామ్మూర్తి, చెల్లెలితో తండ్రి తన పట్ల చూపిస్తున్న పక్షపాతవైఖరి గురించి ఏకరువు పెడుతున్నాడు. అతగాడి దూకుడు మనస్తత్వం తెలిసిన సుభాషిణి, ఊకొడుతూ తన ఓదార్పు మాటలతో సమాధానపరుస్తోంది. ఆమె మాటలు వింటూంటే జీవితాన్ని నిజంగా కాచివడపోసినంత అనుభవంతో చెబుతున్నట్లుగా అనిపించాయి.

తన రాక గమనించిన శ్రీమతి లేచి, పక్కకు తప్పుకుంది. నిర్మలకిచ్చి రెండు కప్పుల్లో టీ పంపించింది. రామ్మూర్తికో కప్పు, శంకర్రావుకీ కప్పు, టీ అందించింది నిర్మల.

"రఘు, చంటీ ఎక్కడికెళ్లారు?" అని కూతుర్ని అడిగాడు శంకరరావు.

"పనుండి ఇంత క్రితమే బైటికెళ్లారు యిద్దరూ" అని సమాధానం చెప్పింది.

రామ్మూర్తి చెప్పిన మాటలన్నీ సాంతం విన్నాడు. తను అనుకున్నంత తెలివితక్కువవాడేం కాదు మావగారు!



ఉండబట్టలేక ఆస్తి వ్రాతకోతల గురించి కదలేశాడు శంకర్రావు.

"ఆస్తి మూడు వాటాల కింద రాయించి, కేష్ చెరో రెండున్నర లక్షలూ పంచి, తనో నాలుగు లక్షలు అట్టే పెట్టుకున్నాడు. మూడో వాటా తన అనంతరం మా పిల్లలకి వ్రాయడం మానేసి మీ పిల్ల పేర వ్రాసాడు" అన్నాడు.

శంకర్రావు చెవులకది ఆనందమైపోయింది.

సుభాషిణి అక్కడికొస్తూ "విన్నారా, మావగారి మంచి బుద్ధి?

నాలుగున్నర గంటల వేళ ఇంటికెళ్లాడు. అప్పటికే శంకర్రావు రెండో బావమరిది రామ్మూర్తి, చెల్లెలితో తండ్రి తన పట్ల చూపిస్తున్న పక్షపాతవైఖరి గురించి ఏకరువు పెడుతున్నాడు. అతగాడి దూకుడు మనస్తత్వం తెలిసిన సుభాషిణి, ఊకొడుతూ తన ఓదార్పు మాటలతో సమాధానపరుస్తోంది. ఆమె మాటలు వింటూంటే జీవితాన్ని నిజంగా కాచివడపోసినంత అనుభవంతో చెబుతున్నట్లుగా అనిపించాయి.

ఇప్పటికైనా మీ పిడివాదం విరమించుకోండి. అంతే గానీ, ఎప్పుడూ ఒకళ్ల సిరిని చూసి ఓర్వలేకపోవడం ఏ మగాడికీ అభివృద్ధి దాయకం కాదు" అనేసి, చక్కాపోయింది.

రామమూర్తికి, ఆ దంపతుల మాటల్లో గల ఆంతర్యం అంతు పట్టలేదు. అతని బాధల్లా ఒక్కటే! నిర్మల పేర వ్రాయించిన ఆస్తిలో మూడవవాటా తన పిల్లలకీ, అన్నగారి పిల్లలకీ, తిరగరాయించుకునే ప్రయత్నంలో బావగారి దగ్గర కొచ్చాడు. ఆ ముక్కేపైకి దాచుకోలేక అనేశాడు.

శంకర్రావు మారు మాట్లాడ లేదు.

సుభాషిణి ఆలోచనలో పడింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ముందుకు దొర్లాయి. శంకర్రావు గత్యంతరం లేక "మీ నాన్న న్యాయంగానే పంచాడు గదయ్యా!" అన్నాడు.

బావగారి అల్పబుద్ధి బైటపడటంతో రామమూర్తి నోరు మూసేశాడు. సుభాషిణి వైపే చూస్తూ వుండిపోయాడు. ఆమె ఏమంటుందోనని ఎదురు చూడసాగాడు.

ఈ లోగా శంకర్రావు గదిలో ఫోన్ మోగింది. ఎత్తి, "వస్తున్నా" అంటూ టోపీనెత్తినెట్టుకుంటూ, నేను వెళ్తానన్నట్లు సైగ చేశాడు.

సుభాషిణి భర్తను దగ్గరకు పిల్చి, "ఏవండీ! ఇప్పుడేం జెయ్యమంటారు? మా నాన్న అడిగితేనే తన ఆస్తిలో మూడో వాటా మన నిర్మలకు చెల్లగలందులకు వీలు వ్రాశాడంటారా?" అంటూ దెప్పిపొడిచింది.

"ఇదిగో, నీ మాట పైనుందని నన్ను నువ్వు దెప్పుతున్నావని గ్రహించాను. ఎంతైనా నేను ఎస్.ఐ. నుండి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ప్రమోట్ అయినవాణ్ని. అందుకే చాపల్యంతో నిన్ను బాధ పెట్టాను. మీ నాన్న బుద్ధి నా కంటే మంచి బుద్ధేలే! ఇప్పుడు మీ చిన్నన్నయ్యకేం చెప్పి పంపిస్తావు? కొండంత ఆశతో వచ్చాడు పాపం!" అంటూ పోబోయాడు లాఠీ ఊపుకుంటూ.

"ఆగండి. అన్నయ్యా! ఇలా రా! మా నిర్మలను నీ కొడుక్కి చేసుకుంటే ఆ ఆస్తి నీకే అంటే, నీ కుటుంబానికే దక్కుతుంది. సరేనా?" అంది సుభాషిణి.

"బాగుంది చెల్లెమ్మా! నీది వెన్నెలాంటి మనసు. బావ కన్నా నువ్వే నయ్యం" అంటూ తానింక వెళ్తానంటూ బయల్దేరబోయాడు.

"ఆగవయ్యా బావగారూ! వియ్యంకుడవుతున్నావు గదూ! భోజనం చేసి మరీ వెళ్లు" అన్నాడు శంకర్రావు.

"అది కాదు బావా! కతికితే అతకదంటారు. ఇంకోసారి తింటాలే" అన్నాడు.

ముగ్గురూ నవ్వుకుంటూంటే, తలుపు చాటు నుండి ఆ విషయం విన్న నిర్మల బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి. ●